

# "ఈ గుణపాఠం చాలు"

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

## ౧-వ రంగము

### రాఘవరావు, రాజేశ్వరి

రాఘవరావు:-(యింట్లోకి వస్తూ) రాజేశ్వరీ! ఏమిటి చాలా ఏకదీక్షగా వ్రాస్తున్నావు?

రాజేశ్వరి:-ఆ! ఏమీలేదండీ (అని రాజేశ్వరి కాగితాలు చాటుగా తీసుకుంటుంది.)

రాఘ:-ఆ కాగితాలు చాటుగా పెట్టుకుంటున్నావు నేను చూస్తానని. ఏదో భావగీతమో, కథానకమో, ఏకాంకికో వ్రాస్తున్నట్టున్నావే!

రాజే:-మేము మీవలె భావకవులము గాదు.

రాఘ:-మరి ఆ రచన యేమిటి?

రాజే:-అంతా తయారైనతర్వాత మీకు చూపిస్తాను. మీకు చూపిస్తేగా మంచీ చెడ్డా తెలిసేది. అంత తొందర యెందుకూ?

(ఇంతలో కొమార్తె లీల, కొమరుడు కృష్ణుడు వస్తారు)

రాఘ:-అమ్మాయి! ఏమిటే మీ అమ్మ వ్రాసేది?

రాజే:-(చెప్పవద్దని కన్ను మలుపుతుంది.)

(లీల మాట్లాడకుండా నిల్చుంటుంది.)

కృ:-నాన్నా నేను చెప్పనా? అమ్మ ప............

రాజే:-కృష్ణా! (అని కొడుకును మందలించి) ఏమీలేదండి, వాడి మాటలన్నీ వట్టివి.

కృ:-ఆఁ వట్టివా? నీవూ రంగనాయకమ్మగారూ కలిసి పజిల్ వ్రాస్తూఉంటారే. చాలా డబ్బు వస్తుందంటివే. డబ్బువస్తే నాకు తొక్కుడుబండి కొనిపెట్టుతానంటివే.

రాఘ:-(పకాపకా నవ్వి) భేష్, బలే మంచివాడవురా, కృష్ణా నీకు మంచి తాయం పెట్టుతా రా, ఓహో పజిల్ పిచ్చి నీకుగూడా పట్టిందీ. యూరోపులో యుద్ధమేఘాలు క్రమ్మినట్టు యిప్పుడు మన తెలుగు దేశమంతటా పజిల్ మేఘాలు కమ్మినాయి. వాళ్లు డబ్బంతా అగ్నిలో ఆహుతిజేస్తుంటే మనవాళ్లు పజిల్సులో ఆహుతిచేసుకుంటున్నారు. ఇదివరకూ మా మగవాళ్లకే ఈ పజిల్ పిచ్చి ఉండేది. ఇప్పుడు తెలుగు పజిల్సు వచ్చినతర్వాత స్త్రీలుగూడా ఈ పిచ్చిలోపడి డబ్బు తగలేస్తున్నారు.

రాజే:-తగలేయడమేమిటి? మొన్న ఎవరికో యిరవైవేలు వచ్చినాయని పత్రికలో వేశారు చూడలే?

రాఘ:-ఎందరోడిస్తే?

రాజే :-ఏడవడమెందుకు? ఇవ్వాళ వాళ్లకు వస్తే రేపు మనకు వస్తుంది.

రాఘు :ఆఁ వస్తుంది. మహామహా కొమ్ములుతిరిగిన మేధావులే నెల నెలా వంద, యాభై రూపాయలు పాడు చేశామని కొట్టుకుంటున్నారు.

రాజే :-అందరూ పోగొట్టుకుంటె ఆ గెలిచేవారి జాబితా అంతా?

రాఘు :-ఎవడో నూటికి కోటికి ఒకడు గెలిస్తే! ఆ గెలిచిన ఒక్కపేరు పెద్దపెద్ద అక్షరాలతో కనిపించేటప్పటికి భ్రమపడి దీపంలో శలభాలులాగా పడిపోతుంటారు వేలకొలది జనం.

రాజే :-ఆఁ మీ మాటలకేమి. ఈ పత్రికలో బహుమానాల జాబితా చూచారా? ఎంతదీర్ఘంగా ఉన్నదో! కొన్నివందల పేర్లున్నట్టున్నాయి?

రాఘు :-ఏ పుణ్యాత్ముడైన పజిల్ మేనేజరైనా ఓడినవాళ్ల పట్టిక ఒకమాటు ప్రకటిస్తే తెలుస్తుంది. ఎన్నివేల సంఖ్యలో ఉంటుందో.

రాఘు :-అయితే ఈ బహుమానదార్లందరికీ బహుమానాలు సరిగా యివ్వబడుతున్నవనే అంటావా?

రాజే :-అయ్యో! ఒకరుగాదు, యిద్దరుగాదు. ఇంతమంది జనం యివ్వకపోతే ఊరుకుంటారా? గోలపుట్టదా?

రాఘు :-దానిలో చాలా కిటుకులు ఉంటాయిలే. అయితే నీ పజిల్ బహుమాన మొత్తమెంత?

రాజే :-అయిదువేలు.

రాఘు :-ప్రధమ బహుమతి?

రాజే :-మూడువేలు.

రాఘు :-భేష్, మన లీల పెండ్లికి ఒక్క కానీ అప్పుచేయకుండా అల్లుడి కట్నంతో సహా సమస్త పెండ్లి కర్చులకు సరిపోయే మొత్తమంతా ఒక్కరూపాయి కర్చుతో సంపాదిస్తున్నావుపో.

రాజే :-అబ్బా! లీల పెండ్లికి నేనెందుకిస్తాను? నాపేర బ్యాంకిలో వేసుకొని సొంతకర్చులకు వినియోగించుకుంటాను.

రాఘు :-కొంచెమైనా ఔదార్యంలేకుండా వచ్చిన మొత్తమంతా దాచుకోడం సబబుగాదు. ఎంతమంది త్యాగంచేస్తే నీకింత సొమ్ము వస్తున్నది చెప్పు.

రాజే :-ఇంక యెవ్వరికీ యేమీ యివ్వను గాని మీకుమాత్రం ఒక బహుమతి చేస్తాను లెండి.

రాఘు :-అయితే వెస్టు అండుకో నుంచి ఒక నూరురూపాయల రిస్టువాచి కొనియియ్యి చాలు.

కృ :-అబ్బా నాకు త్రొక్కుడుబండి కొనిపెట్టకపోతే నేనూరకుంటానుగా?

లీల :-నాకు రాళ్లహారము చేయిస్తానన్నావుగా, నాకు చేయించవలసిందే. (వంటమనిషి సుబ్బమ్మ తటాలున లోపలనుండి వచ్చి) అమ్మగారు నామాట మఱచిపోకండి. చలికాలం తడిగుడ్డ కట్టుకోలేక చస్తున్నాను. ఒక్క పట్టుపంచ కొనిపెట్టితిరా, మీపేరుగా నాలుగేండ్లపాటు కట్టుకుంటాను.

రాజే :-దానికేమి భాగ్యంలే సుబ్బమ్మా, పదిరూపాయలు పెట్టితే వస్తుంది.

రాఘు :-బహుమానాల పంపకం సెటిలైంది. ఇంక బహుమానమే రావాలి.

రాజే:-పజిలు పంపవలసిన ఆఖరుతేది రేపే, రేపు మనియార్డరు చేసిపెట్టుతారుగాదూ.

రాఘు:-సరిసరి, పజిల్ రుసుములు మనియార్డరులు చేయవలసినవాడను నేనా? డబ్బువస్తే బ్యాంకులో వేసుకొనేదానవు నీవా?

రాజే:-మఱి మాకు డబ్బెక్కడిదీ?

రాఘు:-డబ్బులేనివాళ్లకీ పనులెందుకూ?

రాజే:-సంపాదించుకుందామనే కాని, సంపాదన చేతగాదు, ఖర్చులైతే బాగా పెడ్తావంటారుగదా. సంపాదించుతానంటె కాస్త సహాయం చేయరాదూ?

రాఘు:-సరే రెండురూపాయలు శాంక్షన్.

రాజే:-రెండురూపాయలేనా? వాళ్లు పాతిక యాభై ఎంట్రీలు పంపవలెనంటుంటే.

రాఘు:-వాళ్లకేమి, నూరు, రెండునూర్లు ఎంట్రీలైనా పంపమంటారు. ఈ పజిల్సు దేశోద్ధరణకు పెట్టినవా? ప్రజోద్ధరణకు పెట్టినవా? భాషోద్ధరణకు పెట్టినవా? వారి ఉద్ధరణకే వారు పెట్టుకున్నారు. ఎంత ఎక్కువ ఎంట్రీలు పంపితే అంత ఎక్కువ డబ్బు వస్తుంది. వారు పంపమనక యేమిచేస్తారు?

రాజే:-అయితే ఎన్ని పంపమంటారు?

రాఘు:-పది చదరాలు పూర్తిచేయి చాలు. పోస్టు కర్చులతో సహా రెండుంబావలాలో వదిలిపోతుంది. అయినా పూర్తిచేసిన పజిల్సు నాకు చూపనేలేదుగా, నాకేమిపట్టింది డబ్బు కట్టడానికి?

రాజే:-ఆఁ మీకు చూపకుండానే పంపుతానా? భోజనాలు కానివ్వండి నిదానంగా చూస్తురుగాని.

రాఘు: సరే పద.

## ౨-వ రంగము

### రాజేశ్వరమ్మగారి యిల్లు - సమయం సాయంత్రము 4 గంటలు.

### కమలమ్మ, రంగనాయకమ్మ ప్రవేశము

రంగ:-రాజేశ్వరమ్మగారూ! ఏంజేస్తున్నారు?

రాజే:-ఏమీలేదు. రండి, రండి, కూర్చోండి (అని చాపవేస్తుంది.)

అందరు కూర్చుంటారు.

రంగ:-పజిల్ ఏంచేశారు, పంపించారా?

రాజే:-ఆఁ ఏమవుతుందో యివ్వాళే పంపించామండీ, మీరుగూడా పంపారా?

రంగ:-నేను నిన్ననే పంపించాను.

రాజే:-కమలమ్మగారూ మీవిగూడా పంపారా? మీరూ వ్రాశారుగా.

కమ:-ఆఁ వ్రాశానే గాని పంపలేదండి. పంపమంటే మావారు గట్టిగా కేకలేశారు.

రంగ:-ఏమీ?

కమ :- ఈ పజిల్ వ్యవహారమంతా వట్టిమోసం. గెలుస్తామనుకోడం వట్టి దుర్భ్రమ. ఈ కరువుకాలంలో మన కొచ్చే యాభైరూపాయలలో పిల్లలు మనము జీవించడమే కష్టంగా ఉన్నది. యిటువంటి దుర్వ్యయాలకుగూడా ఎక్కడవస్తుంది. మన కష్టార్జితం మనకు చాలదా? లేనిపోని దురాశలెందుకన్నారు. సరే పోనీ వారి కిష్టంలేనప్పుడెందుకని ఊరుకున్నాను.

రంగ :- మావారుగూడా ఈ పజిల్సుగూడా జూదములవంటివేననీ, వందలకొలది పజిల్సు దేశంలో పుట్టి ప్రజలసొమ్ము దోచేస్తున్నవనీ, మీ ఆడవాళ్లుగూడా వీటి పిచ్చిలోబడి డబ్బు నాశనంచేయడంకంటె రాట్నమువంటి ఏ గృహపరిశ్రమో యింటబెట్టుకొని తీరుబడి సమయంలో రోజూ కాస్త నూలు తీసుకున్నామంటే ఈ గుడ్డకరువురోజుల్లో సంసారానికి ఎంతో ఫాయిదాగా ఉంటుందనీ ఎన్నో విధాల చెప్పారు. నేను ఎంతో కష్టపడి వ్రాశాను. ఈతడవకు కట్టండి మళ్లీ మిమ్మలను కోరనంటే, నాకివ్వంటే యిష్టంలేదు, నీ అఘోరింపు చూడలేక కట్టవలసివచ్చిందంటూ తీసుకవెళ్లారు.

రాజే :- మావారూ చాలా చర్చచేసే తుదకు తీసుకవెళ్లారు.

కమ :- నిజమేనండీ. మా అన్నయ్య చెప్పాడుగా. మహామహా చదువుకున్న మగవాళ్లే వందలకొలది డబ్బు దీనికోసం వెచ్చబెట్టి ఓడిపోతూ ఉంటారుటండీ.

రంగ :- నేను వ్రాసింది తప్పకుండా గెలుస్తుందని నా నమ్మకం.

రాజే :- నాదీ ఓడటానికి అవకాశంలేదు. శబ్దరత్నాకరం, ఆంధ్రనామసంగ్రహం దగ్గిరపెట్టుకొని ప్రతిపదమూ చూచిచూచి వ్రాశాను.

కమ :- మనమేనా? వ్రాశేవాళ్లందరూ అట్లాగే వ్రాయరూ? అయినా జయమెవరికో!

రంగ :- అబ్బో, సందెపనులకు వేళైనట్టున్నది. వెళ్లివస్తా.

కమ :- నేనూ వస్తున్నా.

రాజే :- వెళ్లకండి. బొట్టుపెట్టి తాంబూలమిస్తాను. (రాజేశ్వరి బొట్టు తాంబూలమివ్వగా వెళ్లివస్తామండీ అని యిద్దరు వెళ్లుతారు.)

## 3వ రంగము

### ఉదయం తొమ్మిది గంటలు

రాఘ :- (కచ్చేరి సావిట్లో పచారుచేస్తూ) రాజేశ్వరీ! మీ పజిల్సు రిజల్టు తెలిసేది యివ్వాళేగాదూ? (అంటూ ఉండగానే పోస్టుజవాను వస్తున్నాడు)

జవాను :- అయ్యా, ఇదిగో టపా.

రాఘ :- (రాఘవరావు టపా చూస్తుండగా రాజేశ్వరి వేగంగావచ్చి) అదే పజిల్సున్న పేపరు, చూడండి. లేకపోతే నేను చూస్తా యివ్వండి.

రాఘు :-ఎందుకు? ఒక్క క్షణంలో నేనుచూస్తా ఉండు. నీపేరు మొదటివరుసలోనే ఉంటుందిగా (చూచి) రాజేశ్వరీ? నీపేరు మొదటివరుసలో లేదేం!

రాజే :-బాగా చూచారా?

రాఘు :-మొదటి బహుమానార్హులలో మూడే పేర్లున్నవి. వారు ముగ్గురూ మొగవాళ్లే.

రాజే :-ఒక్క తప్పున్న లిస్టు చూడండి.

రాఘు :-ఊఁహూఁ అందులోనూ లేదు.

రాజే :-రెండు తప్పులున్నదాంట్లోనో.

రాఘు :-అందులోనూ సున్నే.

రాజే :-మూడు తప్పులున్న జాబితా చదివారా?

రాఘు :-ఆఁ అదీ చూచా. ఎక్కడా కన్పడలేదు. పాపం రంగనాయకమ్మగారి పేరుగూడా లేదే.

రాజే :-మెరిట్ బహుమానాల్లోనైనా ఉన్నదేమో.

రాఘు :-ఇంకా పిచ్చిఆశ యెందుకు పెట్టుకుంటావు? మెరిట్లో లేదు గిరిట్లో లేదు, రెండురూపాయల నాలుగణాలు మసి. నీకింకా అనుమానం తీరకపోతే తీరుబడిగా కూర్చొని చదువుకో.

రాజే :-ఏదీ, పజిల్సు ఎట్లా పూర్తిచేయబడ్డవో చూస్తా ఉండండి. (పెనిమిటి చేతిలో పత్రిక అందుకొని) అమ్మో! ఈ అపశబ్దాలు చూచారా? గొడుగుకు - గొడువుట, అభిమానమునకు - అభిమాతముట, ఇటువంటివే నాలుగైదున్నాయి చూచారా? ఇవి యే నిఘంటువులోనైనా ఉన్నాయా?

రాఘు :-ఏమైతేనేమి, మేనేజరు తీర్పుకు బద్ధులమని వ్రాసియిచ్చారుగా?

రాజే :-పదములు మార్చేయడంలోకూడానా?

రాఘు :-ఆ అన్నిహక్కులు మేనేజరువే.

రాజే :-ఇది కేవలం అన్యాయం. వాళ్లు సరియైన పదములు వాడినట్లైతే నా పజిల్ యేమాత్రం తప్పేదికాదు. రంగనాయకమ్మగారుకూడా ఓడేవారుకారు.

రాఘు :-మీకు న్యాయప్రకారం బహుమానార్హత ఉన్నట్లైతే వాళ్లు ఒకసూచన చేశారు చూచావా? దీనినే స్క్రూటినీ హక్కు అంటారు. అయిదురూపాయలు ఫీజుకట్టి తమ అర్హతను సూచిస్తూ వ్రాస్తే న్యాయమని వారికి తోస్తే ఆ బహుమానమిస్తారుట, కాదనుకుంటే యివ్వరట. పైగా ఆ అయిదు రూపాయల ఫీజుగూడా ఆ పజిల్ వారికే చెందుతుందిట. ఏమి, వ్రాస్తావా? యేమిటి?

రాజే :-సరి సరి. ఈ గుణపాఠం చాలు, ఇంకానా?

రాఘు :-మంచి రిస్టువాచీ వచ్చే ఛాన్సు పోయింది రాజేశ్వరీ!

రాజే :-అబ్బా! ఊరుకోండి. సమయాసమయాల్లేకుండా పరిహాసం!